క్లుప్తంగా

లక్ష్యాలను చేరుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో ఉషారాణి

మునగపాక: తమకు కేటాయించిన లక్ష్యాలను చేరుకోవాలని ఎంపీడీవో ఎం.ఉషారాణి కోరారు. మండల పరిషత్ హాలులో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో హౌసింగ్ ప్రగతిపై సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో కేటాయించిన లక్ష్యాలను సకాలంలో చేరుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని సూచించారు. హౌసింగ్ ఏఈ రాము అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

మునగపాక పీఎస్‌ను సందర్శించిన సీఐ

మునగపాక: స్థానిక పోలీసు స్టేషన్‌ను మంగళవారం సాయంత్రం యలమంచిలి సీఐ ధనుంజయరావు సందర్శించారు. స్టేషన్ విజిట్‌లో భాగంగా పలు రికార్డులు పరిశీలించారు. కేసుల వివరాలను స్థానిక ఎస్‌ఐ ప్రసాదరావును అడిగి తెలుసుకున్నారు. అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి సారించాలని సూచించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి



వీధి దీపాల పనులను పరిశీలిస్తున్న ఉప సర్పంచ్ దేవీచంద్ర

మునగపాక: గంగాదేవిపేటలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని మూలపేట ఉప సర్పంచ్ మొల్లేటి దేవీచంద్ర తెలిపారు. ఇటీవల వీచిన ఈదురుగాలులకు దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలకు చెందిన వీధి దీపాలు వెలగకపోవడంతో మంగళవారం ఆయన సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. మూలపేట పంచాయతీ శివారు గంగాదేవిపేటలో సమస్యలను సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు, పాలకవర్గ సభ్యుల సహకారంతో పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య



ధర్మవరంలో ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

ఎస్.రాయవరం: ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులకు అన్ని వసతులు అందిస్తూ నాణ్యమైన విద్య నేర్పిస్తున్నట్టు ధర్మవరం అగ్రహారం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.శ్రీనివాసరావు తెలిపారు. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ధర్మవరంలో ప్రచారం నిర్వహించి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు గార ప్రకాష్, దీపిక, కరుణ, కుసుమకుమారి, అరుణ, విమలాదేవి, కృష్ణవేణి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఎస్.రాయవరం: కొరుప్రోలు సబ్ స్టేషన్ పరిధిలో ఎస్.రాయవరం ఫీడర్‌కు సంబంధించి ఎస్.రాయవరం, ఉప్పరాపల్లి, కర్రివానిపాలెం, లింగరాజుపాలెం, సైతారుపేట, జేవీపాలెం, వేమగిరి, పేటసూదిపురం గ్రామాలకు, ధర్మవరం ఫీడర్ పరిధిలో ధర్మవరం, పెనుగొల్లు గ్రామాలకు బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ రాజశేఖర్ తెలిపారు. విద్యుత్ లైన్‌లో చెట్టుకొమ్మలు తొలగింపు, మరమ్మతులు చేపట్టే క్రమంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

సెక్యూరిటీ గార్డు అదృశ్యం



వెంకటసాయి (ఫైల్)

ఎస్.రాయవరం: కర్రివానిపాలెం గ్రామానికి చెందిన సిద్దిల వెంకటసాయి అదృశ్యంపై అతడి తల్లి వెంకటలక్ష్మి ఫిర్యాదు చేసినట్టు ఎస్‌ఐ విభీషణరావు మంగళవారం తెలిపారు. బంగారమ్మపాలెం ఎస్ఏవోబీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న కుమారుడు ఈ నెల 18న గ్రామ దేవత పండగకు వెళ్తానని చెప్పి తిరిగి ఇంటికి రాలేదన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఆచూకీ తెలిసిన వారు 9440796107 ఫోన్ చేయాలన్నారు.

మత్స్యకార భరోసాకి బయోమెట్రిక్

అచ్యుతాపురం రూరల్: మత్స్యకార భరోసాకి బయోమెట్రిక్ తప్పనిసరి అని మండల మత్స్యశాఖ అధికారి రవితేజ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24, 25 తేదీల్లో అర్హులైన మత్స్యకారులు బయోమెట్రిక్ చేసుకోవాలన్నారు. లబ్ధిదారులందరూ బ్యాంక్ ఖాతాలకు ఎన్‌పీసీఐ లింకై ఉండాలన్నారు.

మామిడి రైతు కుదేలు



ఒక్క కాయ కూడా లేని మామిడి చెట్టు

ఆరంభంలో విరబూసిన పూత

తేనెమంచు దెబ్బకు రాలిన పిందె

ఈదురుగాలులకు నేలరాలిన కాయలు

తీవ్రంగా నష్టపోయిన అన్నదాతలు

కోటవురట్ల: మామిడి రైతు త్రిశంకు స్వర్గంలో ఊగిసలాడుతున్నాడు. లాభాలు మెండుగా వస్తాయని ఆశపడితే, వాతావరణ పరిస్థితులు ఉసూరుమనిపించాయి. ఆరంభంలో విరబూసిన పూతతో రైతుల్లో ఎన్నో ఆశలు రేగాయి. మూడేళ్లుగా వస్తున్న నష్టాలను ఈ ఏడాదైనా పూడ్చుకోవచ్చని ఆశపడ్డారు. పూత నిలబడేందుకు, పిందె బాగా వచ్చేందుకు పురుగుల మందుల రూపంలో భారీగా పెట్టుబడులు పెట్టారు. ఈసారి లాభాలు గ్యారంటీ అనుకున్న రైతులు అప్పులు చేసి మరీ పెట్టుబడులు పెట్టారు. రాను రాను ఆ ఆశలు తారుమారయ్యాయి. దట్టంగా అలుముకున్న పొగమంచు, అకాల వర్షాలు, వడగళ్ల వానలు, ఈదురుగాలులు నిండా ముంచేశాయి. పొగమంచుతో చాలా వరకు పూత మాడిపోయి నష్టం వాటిల్లింది. ఆ తర్వాత వచ్చిన పిందెను కాపాడుకునేందుకు పడరాని పాట్లు పడ్డారు. పిందె తొడిగాక కూడా పొగమంచు వీడకపోవడంతో తేనెమంచు పురుగు ఆశించి కాయలు దెబ్బతిన్నాయి. అక్కడక్కడా కాపు ఉన్నా కాయ ఎదుగుదల లేక రైతులు ఆవేదన చెందుతున్నారు. కాపుకు తోటలను లీజుకు తీసుకున్న రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని చెబుతున్నారు.

నియోజకవర్గంలో..

పాయకరావుపేట నియోజకవర్గంలో 8,573 ఎకరాలలో మామిడి పంట సాగులో ఉంది. పాయకరావుపేట మండలంలో 819 ఎకరాలు, నక్కపల్లి మండలంలో 5,626 ఎకరాలు, ఎస్.రాయవరం మండలంలో 893 ఎకరాలు, కోటవురట్ల మండలంలో అత్యధికంగా 1,235 ఎకరాలలో మామిడి తోటలు ఉన్నాయి. ఎక్కువగా కలెక్టర్, బంగినపల్లి, సువర్ణరేఖ, కొత్తపల్లి కొబ్బరి, నీలం తదితర రకాలు సాగులో ఉన్నాయి.



అంతంత మాత్రంగా ఉన్న కాపు

పెట్టుబడి వచ్చే పరిస్థితి లేదు..

ఆరంభంలో విరబూసిన పూత ఆశలు పెట్టింది. ఆ తర్వాత వాతావరణం పూర్తిగా దెబ్బతీసింది. మంచు వల్ల పూత మాడిపోవడమే కాకుండా పిందెను తేనెమంచు పురుగు ఆశించింది. అకాల వర్షాలు మరింత దెబ్బతీశాయి. ఫలితంగా రైతు పూర్తిగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే పలు ప్రాంతాల్లో మామిడి కోతకు రాగా, మండలంలో ఇంకా కాయదశలోనే ఉంది. పూత వచ్చేందుకు ఎరువులు, పురుగుల మందులు, దుక్కులు, చెట్లకు పాదికట్టడానికి రైతులు చాలా పెట్టుబడి పెట్టారు. ఎకరాకు రూ.20 నుంచి రూ.35 వేలు వరకు పెట్టుబడి పెట్టారు. కాపు సరిగ్గా లేకపోవడంతో పాటు ఎదుగుదల లేకపోవడంతో అప్పులు కూడా తీర్చలేని పరిస్థితి ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడేళ్లుగా ఇదే పరిస్థితి ఉందని ఈ ఏడాది కూడా నష్టాలే అని వాపోతున్నారు. మామిడి రైతును ఆదుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఈ ఏడాది కూడా నష్టమే..



మూడేళ్లుగా మామిడి పంటతో నష్టాలు వస్తున్నాయి. ఈ ఏడాదైనా గట్టెక్కుతామని ఆశపడ్డాం. పూత చూసి ధైర్యం అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టాం. మంచు వల్ల పూత మాడిపోయి నష్టం వచ్చింది. కాపు పెద్దగా లేకపోగా అకాల వర్షాలు మరింత దెబ్బతీశాయి. నాకు రెండెకరాలు ఉంది. రూ.20 వేలు వరకు పెట్టుబడి పెట్టాను. కాపు సరిగ్గా లేదు. నష్టం వచ్చేలా ఉంది.

– మాకిరెడ్డి సత్యనారాయణ, మామిడి రైతు, కె.వెంకటాపురం

ప్రభుత్వం ఆదుకోవాలి..



మామిడి రైతును ప్రభుత్వమే ఆదుకోవాలి. మూడేళ్లుగా తీవ్ర నష్టాలే వస్తున్నాయి. ఎంత పెట్టుబడి పెట్టినా ఉపయోగం లేదు. ఇలాగైతే మామిడి తోటలను తీసేయడమే మేలు. ప్రతీ సంవత్సరం ఆశ పుడుతోంది. పూత బాగున్నా వాతావరణంతో మొత్తం మారిపోతోంది. మామిడి రైతు నిలబడేలా ప్రభుత్వం ప్రత్యేక రాయితీలు కల్పించి పెట్టుబడి సాయం కూడా అందించాలి.

– తమరాన నర్సింహమూర్తి, మామిడి రైతు, కె.వెంకటాపురం

రైతులకు అవగాహన కల్పించాం



మామిడి, జీడి రైతులకు ఉద్యానవన శాఖ ద్వారా పలు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాం. యాజమాన్య పద్ధతులు, పూత నిలబడేందుకు, పిందె ఎదిగేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలను ఆరంభంలోనే వివరించాం. ఈ ఏడాది మామిడి పంట అనుకూలంగా లేదు. కొన్ని ప్రాంతాల్లో మాత్రమే బాగుంది. ఈదురుగాలులు కూడా నష్టాన్ని కలిగిస్తున్నాయి. రైతులు సకాలంలో పంటను కోసి ఎగుమతి చేసుకోవాలి.

– శిరీష, ఉద్యానవన శాఖాధికారి

అధికార పార్టీ వారికే కార్పొరేషన్ రుణాలు



రుణాలపై ప్రశ్నిస్తున్న జెడ్పీటీసీ ఉమాదేవి

కోటవురట్ల: బీసీ కార్పొరేషన్ రుణాలను ఏ ప్రాతిపదికన మంజూరు చేస్తున్నారని జెడ్పీటీసీ సభ్యురాలు సిద్ధాబత్తుల ఉమాదేవి ప్రశ్నించారు. ఎంపీడీవో కాశీవిశ్వనాథరావును ఆమె మంగళవారం కలుసుకుని రుణాల మంజూరుపై వివరాలు కోరారు. బీసీ కార్పొరేషన్ రుణాలు అధికార పార్టీ కార్యకర్తలకు మాత్రమేనా అని ప్రశ్నించారు. రాజకీయం చేయకుండా అర్హులకు రుణాలు ఇవ్వకుండా అధికార పార్టీ నాయకులు పంచుకోవడం తగదన్నారు. అధికారులు వత్తాసు పలకడం దారుణమన్నారు. అర్హులు కొంతమందికైనా రాజకీయం చేయకుండా రుణాలు ఇచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. వైఎస్సార్ సీపీ నాయకుడు సిద్ధాబత్తుల సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ యల్లపు కుమారరాజా ఉన్నారు.

హైస్కూల్‌కు ఆర్వో ప్యూరిఫై, ఫ్యాన్లు వితరణ



ఫ్యాన్లు వితరణ చేస్తున్న పూర్వ విద్యార్థులు

మునగపాక: స్థానిక జెడ్పీ హైస్కూల్‌కు పలు రకాల పరికరాలను దాతలు మంగళవారం వితరణ చేశారు. ఇక్కడ 1998–99 టెన్త్ బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఐదు ఫ్యాన్లను, వర్‌బాక్ ఏనిమల్ హెల్త్ ఇండియా ఆధ్వర్యంలో ఆర్వో ప్యూరిఫైను అందజేశారు. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు సంబంధిత కంపెనీ ప్రతినిధులు కె.రంగాచారి, బి.సంతోష్, లావేటి ప్రదీప్‌కుమార్ హైస్కూల్ కమిటీ చైర్మన్ ఆడారి సూర్యచంద్రరావు, హెచ్‌ఎం శ్రీనివాసరావులకు అందజేశారు. దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

తాళ్లమ్మా..చల్లగా చూడమ్మా..

నాలుగు గ్రామాల్లో వైభవంగా అమ్మవారి జాతర



తాళ్లమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

యలమంచిలి రూరల్: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి.. భక్తుల కొంగు బంగారం.. నాలుగు గ్రామాల ప్రజల ఇలవేల్పు తాళ్లమాంబ జాతర మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. మండలంలోని పురుషోత్తపురం, పోతురెడ్డిపాలెం, రుక్మిణీపురం, కొత్తలి గ్రామాల్లో తాళ్లమ్మవారి జాతరను పురస్కరించుకుని ఆయా గ్రామాల్లో ఆలయాల వద్ద అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. మహిళలు చీర, జాకెట్టు, నల్లపూసలు, పసుపు కుంకుమలతో అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. కొందరు భక్తులు తలనీలాలు సమర్పించారు. జాతర సందర్భంగా నాలుగు గ్రామాల్లో బంధుమిత్రులు, స్నేహితులు, ఆప్తుల రాకతో సందడి వాతావరణం ఏర్పడింది. రాత్రి పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. సాంస్కృతిక కార్యక్రమాలు, నేలవేషాలు ఆకట్టుకున్నాయి. పలు రాజకీయ పార్టీల నాయకులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయా గ్రామాల పరిధిలో అమ్మవార్ల ఆలయాల పరిసరాలు, రహదారుల వెంబడి విద్యుత్ దీపాలతో అలంకరించారు. యలమంచిలి రూరల్ పోలీసులు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

లాభసాటి యంత్రాలపై దృష్టి సారించాలి



చూచుకొండలో వర్ధమాన్ థ్రెసర్ యంత్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మునగపాక: మండలంలోని చూచుకొండలో వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు పర్యటించారు. గ్రామానికి చెందిన రైతు పెంటకోట శివ వెంకటప్పారావు ఇటీవల రాయితీపై వర్ధమాన్ థ్రెసర్ యంత్రాన్ని కొనుగోలు చేశాడు. ఫార్మర్ అండ్ న్యూట్రిషన్ సెక్యూరిటీ స్కీమ్‌లో భాగంగా ఈ యంత్రాన్ని అందించారు. యంత్రం అసలు ధర రూ.2,48,000 కాగా, రైతు తన వాటాగా రూ.1,68,000 చెల్లించాడు. ప్రభుత్వం రూ.80 వేల మేర సబ్సిడీ అందించింది. ఈ యంత్రాన్ని మంగళవారం కమిషనరేట్ నుంచి ఏడీఏ ఆర్. శశిధర్ రెడ్డి, ఏవో సురేష్‌బాబు పరిశీలించి రైతు అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు 200 గంటలకు 200 ఎకరాల వరి పొలాన్ని నూర్చినట్లు తెలిపారు. గంటకు రూ.1200 వరకు ఆదాయం వస్తుందని, ఈ యంత్రం లాభసాటిగా ఉందని రైతు చెప్పినట్లు అధికారులు తెలిపారు. మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నకుమారి, ఏవో గాయత్రి, వీహెచ్‌ఏ భానుశ్రీ పాల్గొన్నారు.

బాలల సంరక్షణ కమిటీల పాత్ర కీలకం



కమిటీ విధి విధానాలను అడిగి తెలుసుకుంటున్న తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు

మునగపాక: ప్రతి ఒక్కరూ బాల్య వివాహాలను నిరోధించాలని తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు కోరారు. మండలంలోని మెలిపాక, చెర్లోపాలెం గ్రామాల్లో మంగళవారం గ్రామస్థాయి బాలల సంరక్షణ కమిటీల ఏర్పాటు కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ సంయుక్త నిర్వహణలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన ఆదిమహేశ్వరరావు మాట్లాడుతూ కమిటీ సభ్యులు బాధ్యతగా పనిచేయాలన్నారు. బాల కార్మికులను పనిలో పెట్టుకోవడం వల్ల కలిగే అనర్థాలు, బాలికలపై వేధింపులు తదితర అంశాలకు సంబంధించి ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. జిల్లా బాలల సంరక్షణ విభాగం క్షేత్రస్థాయి కార్యకర్త కేఎల్‌వీ రమ్య, సర్పంచ్‌లు అయినంపూడి విజయభాస్కరరాజు, సత్యవతి, పంచాయతీ కార్యదర్శులు షణ్ముఖరావు, అరుణ్‌కుమార్, వీఆర్వోలు అశోక్ పవన్‌కల్యాణ్, మహిళా పోలీసులు వనజ, పుష్పలత తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

శోభాయమానంగా శ్రీరామ రక్ష రథయాత్ర



శ్రీరామ రక్ష రథయాత్ర

రాంబిల్లి(అచ్యుతాపురం): రాంబిల్లి మండలంలో పలు గ్రామాలు శ్రీరామ నామస్మరణతో మార్మోగాయి. ఇందులో భాగంగా పదో రోజైన మంగళవారం రాంబిల్లి మండలం ఆర్.నర్సాపురం, కృష్ణంపాలెం, సంతపాలెం, అప్పన్నపాలెం, కొండవారిపాలెం గ్రామాల ప్రజలు రాముని సేవలో తరించారు. కోలాటాలు, తప్పెటగుళ్లు, భజనలు, సేవ గరిడీలతో రథయాత్ర శోభాయమానంగా మారింది. విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్, యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి, రాజాన సన్యాసినాయుడు, వర్మ, వరహా గోవిందరెడ్డి, కొల్లి అప్పారావు, పప్పు ఈశ్వరరావు, చింతకాయ రాజు తదితరులు పాల్గొన్నారు.

బైకు, 2 కేజీల గంజాయి స్వాధీనం

ఎస్.రాయవరం: పెదగుమ్ములూరు సమీపంలో నర్సీపట్నం ఆర్అండ్‌బీ రోడ్డుపై వాహనాలు తనిఖీ చేస్తుండగా బైకుపై ఇరువురు వ్యక్తులు రెండు కేజీల గంజాయి తీసుకువస్తూ పట్టుబడ్డారని ఎస్‌ఐ విభీషణరావు తెలిపారు. తుని పట్టణానికి చెందిన కప్పరాతి శ్రీను, రామిశెట్టి సాయిబాబా బైకుపై వస్తుండగా వాహనాల తనిఖీ సమయంలో పట్టుబడ్డారన్నారు. వీరిద్దరు గంజాయి తాగేందుకు ఏజెన్సీ నుంచి తీసుకువస్తున్నట్టు చెప్పారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి ఇద్దరిని తీసుకుని గంజాయి, బైకు సీజ్ చేశామన్నారు.

జేవీవీ పోటీల్లో విద్యార్థి నిషాల్‌కి ద్వితీయ స్థానం



బహుమతి అందజేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం: జన విజ్ఞాన వేదిక రాష్ట్ర స్థాయి పోటీల్లో మండలంలోని డీపాల్ విద్యార్థి ప్రతిభ కనబరిచారు. 2025కి గానూ జనవిజ్ఞాన వేదిక నిర్వహించిన రాష్ట్ర స్థాయి సైన్స్ ప్రయోగాల వీడియో పోటీల్లో సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగంలో డీపాల్‌కు చెందిన నిషాల్‌కి ద్వితీయ స్థానం లభించింది. ఈ మేరకు జన విజ్ఞాన వేదిక అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి మారిసెట్టి వెంకట అప్పారావు నుంచి బహుమతి అందుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఫాదర్ రాయ్, గైడ్ టీచర్ కృష్ణవేణి, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు త్రిమూర్తులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకార భరోసా గడువు పొడిగించాలి

అచ్యుతాపురం రూరల్ : జిల్లాలోమత్స్యకార భరోసా గడువు సమయాన్ని పొడిగించాలని జిల్లా మత్స్యకార నాయకుడు చోడిపల్లి అప్పారావు డిమాండ్ చేశారు. మంగళవారం మత్స్యకారుల సమస్యలను ఉద్దేశించి స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడారు. గతంలో ప్రతి సంవత్సరం మత్స్యకార భరోసా లబ్ధిదారులకు ఒక నెల ముందుగా ప్రభుత్వం నమోదు చేసుకోవాలని సమయం కేటాయించేవారన్నారు. ఈ సంవత్సరం హడావుడిగా ఎటువంటి అవగాహన కల్పించకుండా ఏప్రిల్ 15 నుంచి 18 వరకూ మాత్రమే గడువు ప్రకటించడం చాలా అన్యాయమన్నారు. మత్స్యశాఖ అధికారులు గత సంవత్సరంలో అర్హుల జాబితా సేకరించడంతో ఈ ఏడాది ఇక నమోదు చేసుకునే అవసరం లేదని పూడిమడక మత్స్యకారులు భావించారన్నారు. కావున ప్రభుత్వం మత్స్యకార భరోసా నమోదుకు నెల రోజుల సమయం కేటాయించి, అర్హులకు గత సంవత్సరం, ప్రస్తుత సంవత్సరం కలిపి రూ.40 వేలు జమ చేయాలని అప్పారావు ప్రభుత్వాన్ని కోరారు.

మద్యం విక్రేత అరెస్టు

మునగపాక: ఎటువంటి అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని మంగళవారం ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. 8 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. మునగపాక శివారు మద్యం విక్రయిస్తున్నట్లు అందిన ఫిర్యాదు మేరకు ఎక్సైజ్ ఎస్‌ఐ ఎస్‌వీ నారాయణ తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో మునగపాకకు చెందిన మళ్ల కాశీ విశ్వనాథంను అరెస్టు చేశారు.

మ్యుటేషన్ చేయకుండా తిప్పుతున్నారు

రాంబిల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద బైఠాయింపు



రాంబిల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద బైఠాయించిన భోగాపురం బాధితులు

రాంబిల్లి(అచ్యుతాపురం): సాంకేతిక విప్లవం ఎంత అందుబాటులోకి వచ్చినప్పటికీ భూ వివాదాలు, సమస్యలు ఇంకా కొనసాగుతున్నాయి. భూముల విలువ ఆకాశాన్నంటడంతో దళారులు చూపు, అధికారుల ఆశావాదం కొందరికి శాపంగా మారుతోంది. రాంబిల్లి మండలంలోని రు.వీరాస్వామి,కే.నారాయణల పరిస్థితి ఇలాగే మారింది. రాంబిల్లి మండలంలోని పంచదార్ల శివారు భోగాపురానికి చెందిన వీరికి తండ్రి నుంచి దఖలు పడిన భూమి మ్యూటేషన్ కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ మ్యూటేషన్ చేయడం లేదంటూ సదరు బాధిత కుటుంబీకులు మంగళవారం రాంబిల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. వీఆర్వో, ఆర్‌ఐ, సర్వేయర్, జిల్లా సర్వేయర్లు అనుకూలంగా సర్వే రిపోర్టు ఇచ్చినప్పటికీ నాలుగు నెలలుగా మ్యుటేషన్ చేయకుండా కాలయాపన చేస్తున్నారని, తమకు న్యాయం చేయాలని తహసీల్దార్ కార్యాలయం వద్ద బైఠాయించారు.

మృతులకు రూ.50 లక్షలు ఇవ్వాలి

మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యురాలు ఉమాదేవి

కోటవురట్ల: కైలాసపట్నంలోని బాణసంచా ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు కనీసం రూ.50 లక్షలు చెల్లించాలని జెడ్పీటీసీ సభ్యురాలు సిద్ధాబత్తుల ఉమాదేవి కోరారు. ఎంపీపీ సింగంపల్లి అప్పలనాయుడు అధ్యక్షతన మంగళవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. వైస్ ఎంపీపీ ఆర్ఎస్ సీతారామరాజు, జెడ్పీటీసీ ఉమాదేవి శాఖల వారీగా సమీక్ష చేశారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ అగ్ని ప్రమాదంలో పది మంది చనిపోతే ఇప్పటికి ఏడుగురికి మాత్రమే రూ.15 లక్షలు చొప్పున పరిహారం అందించారన్నారు. క్షతగాత్రులకు రూ.లక్ష చొప్పున ఇస్తామనడం దారుణమన్నారు. ఉపాధి హామీ పథకంలో రూ.6 కోట్ల బకాయిలు ఉన్నాయని, కూలీలు ఏం తిని బతకాలని ప్రశ్నించారు. చౌడువాడ, కొడవటిపూడి, కోటవురట్లతో పాటు మండలంలోని పలు గ్రామాలలో మంచినీటి సమస్యలు ఉన్నాయని, సర్పంచులు గోపాలకృష్ణ, అప్పారావు, ఎంపీటీసీ పుత్రేవు బాబు అధికారులకు ఫిర్యాదు చేశారు. కోటవురట్లలో ఏడాదిగా మంచినీటి ట్యాంకు నిర్మించడంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఎంపీటీసీ బాబు ఆరోపించారు. నీలిగుంట సర్పంచ్ వరహాలబాబు మాట్లాడుతూ వారం రోజులుగా గ్రామంలో ఉపాధి పని కల్పించలేదని, రాజకీయం చేసి కూలీల కడుపుకొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో 80 మందికి నేటికీ రేషన్ సరుకులు ఇవ్వలేదని తెలిపారు. స్థానిక సీహెచ్‌సీలో 108 వాహనం అందుబాటులో లేకపోవడంతో రోగులు, ప్రమాదాలకు గురైన వారు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, వెంటనే అంబులెన్సును అందుబాటులోకి తీసుకురావాలని చౌడువాడ సర్పంచ్ గోపాలకృష్ణ కోరారు. చౌడువాడలోని చెరువు ఆక్రమణను తొలగించి ఉపాధి హామీ పథకం ద్వారా గట్టు నిర్మించాలని కోరారు. పంట కాలువల్లో చాలా చోట్ల గేట్లు మరమ్మతులకు గురయ్యాయని, రూ.96 లక్షలు అవసరం ఉన్నట్టు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చినట్టు జేఈ రాజేష్ తెలిపారు. ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు, అధికారులు పాల్గొన్నారు.


ఉపాధి వేతనాలు చెల్లించాలని డిమాండ్



వేతనాల కోసం డిమాండ్ చేస్తున్న ఉపాధి కూలీలు

నక్కపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి కూలీలకు వేతనాలు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు డిమాండ్ చేశారు. 2 నెలల నుంచి ఉపాధి పనులకు వెళ్లిన కూలీలకు వేతనాలు ఇవ్వలేదన్నారు. వీరంతా మండుటెండలో పనులకు వెళ్తున్నారని, వీరికి వారంతపు రోజున వేతనాలు చెల్లించాల్సి ఉందన్నారు. కాని ప్రభుత్వం వీరికి వేతనాలు చెల్లించకుండా పస్తులు పెడుతోందన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి రూ.961 కోట్లు విడుదల చేసిందని, ఈ నిధులను తక్షణమే కూలీల వేతనాల కింద వారి ఖాతాల్లో జమ చేయాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ నాయకుడు ఎం అప్పలరాజు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన చందనాడ, నల్లమట్టిపాలెం తదితర గ్రామాల్లో ఉపాధి పనుల వద్దకు వెళ్లి వారితో కలిసి వేతనాలు చెల్లించాలంటూ నినాదాలు చేశారు.

పేద పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్య



మాట్లాడుతున్న మండల విద్యాశాఖాధికారి సీఆర్టీ దేవరాయల్

అచ్యుతాపురం రూరల్: పేద పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం అర్హత కల్పిస్తున్నట్లు ఎంఈవో సీఆర్టీ దేవరాయల్ తెలిపారు. మంగళవారం ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులతో విద్యా శాఖ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025–26 సంవత్సరానికి గాను ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో పేద పిల్లలకు 25 శాతం ఉచిత సీట్లు కేటాయించారన్నారు. ఐబీ, ఐసీఎస్ఈ, సీబీఎస్ఈ, స్టేట్ సిలబస్ పాఠశాలలకు నిబంధనలు వర్తిస్తాయన్నారు. ఎస్సీ–10%, ఎస్టీ–4%, బీసీ మైనార్టీ ఇతరులకు–6%, అనాథలు హెచ్ఐవీ పీడితులు దివ్యాంగులకు–5% అర్హత కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవడానికి సీఎస్ఈ వెబ్ పోర్టల్‌లో ఈ నెల 28 నుంచి మే 15 వరకూ దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఆదాయ పరిమితి గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.20లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.1.44 లక్షలు లోపు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రజనీ దేవి పాల్గొన్నారు.